## ఎన్యుమరేటర్ల ఎదురుచూపులు

- ఐదు నెలలైనా అందని రెమ్యునరేషన్
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉద్యోగుల ఇబ్బందులు

తొర్రూరు, మార్చి 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నది. గతేడాది నవంబర్ 9 నుంచి 24 వరకు నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటివరకు పారితోషికం చెల్లించలేదు. జిల్లావ్యాప్తంగా 1,884 ఎన్యుమరేటర్లు, 186 సూపర్‌వైజర్లు 2,45,953 కుటుంబాలను సర్వే చేశారు. ఎన్యుమరేటర్లకు రూ.10వేలు, సూపర్ వైజర్లకు రూ.12వేలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఫామ్‌కు రూ.25 చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అయితే, సర్వే పూర్తయినా నిధుల విడుదలలో స్పష్టత లేకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పారితోషికం కోసం ఐదు నెలలుగా ఎదురుచూస్తున్నారు. మార్చి 31లోపు నిధులు విడుదల చేయకపోతే అవి వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ సారథి

## రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 16 : రైతులు సంఘటితంగా ఉంటూ తమ హక్కుల సాధనకు ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేక వీరన్న, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ సారథి అన్నారు. ఆదివారం మండలంలోని ముడుపుగల్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేసి రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాల మెడలు వంచేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. 'రైతు ఏడ్చిన రాజ్యం.. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం' బాగుపడదనే నానుడి ఉందని, రైతులను ఇబ్బంది పెట్టే విధానాలు మానుకోవాలన్నారు. ఈ నెల 18న బయ్యారం మండల కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాండురంగాచారి, తండా సందీప్, శ్రీనివాస్, నవీన్, శేఖర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు పీరయ్య

## మాదిగలకు మంత్రి పదవులు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 16 : తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా గల మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన నిరసన దీక్షను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన దీక్షను రాష్ట్ర ప్రభుత్వం ధ్వంసం చేసి, మాదిగ విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మాదిగలు భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. తమ హక్కులు సాధించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని, వర్గీకరణ చేసిన తర్వాతనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోఎండీ రజియా, రమేశ్, భిక్షపతి, సరోజ, మంగమ్మ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**
★Wanted Female Marketing Executives for a Reputed Pvt. Ltd Company. Salary : 12,000/- to 20,000/-, Quli: Inter/Degree, Age: 24 to 30. Cont: 7660009009, 7036229903
NTW-000

**PLOT FOR SALE**
★జనగామ కలెక్టరేట్‌కు & కొత్త విమానాశ్రయం, Textile Parkకు అతి చేరువలో DTCP/ RERA approved Layoutతో గజం కేవలం 5,499/-కి పొందండి with all Developmenting. Contact: 7780324073.
NT-330714

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# భగీరథ నీళ్లు నల్లగా..

- వాటర్ ట్యాంక్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, క్రిమికీటకాలు, నాచు
- 15 రోజులకోసారైనా శుభ్రం చేయించని అధికారులు
- రంగుమారిన తాగునీళ్లు.. అనారోగ్యం బారిన ప్రజలు
- తిప్పలుపడుతున్న చర్లచంద్రుతండా వాసులు


చర్లచంద్రులో వ్యవసాయ బావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న తండా మహిళలు

నర్సింహులపేట, మార్చి 16 : పాలకుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదికి తెస్తున్నది. ఎంతో ఉన్నత ఆశయంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ శుద్ధి చేసిన జలాలను అందించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో వాటర్ ట్యాంకులను నిర్మించడంతోపాటు ఇంటింటికీ నల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీటి నిర్వహణను గాలికొదిలేసింది. ఫలితంగా శుద్ధి చేసిన జలాలకు బదులు కలుషిత నీరు సరఫరా అయి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగం గా గ్రామాలు, తండాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతోపాటు క్రిమికీటకాలు, నాచు, పాకురుతో కూడిన నీళ్లు సరఫరా అవుతున్నాయి. అవే నీళ్లను జనా లు తాగి అనారోగ్యం పాలవుతున్నారు. నర్సింహులపేట మండలం గోల్‌బొడ్కతండా శివారు చర్లచంద్రుతండాలో ఇదే పరిస్థితి ఉన్నది. వాటర్ ట్యాంకును 15 రోజులకోసారి శుభ్రం చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదని తండా ప్రజలు చెబుతున్నారు. వాటర్‌ట్యాంకుకు మూత లేక పోవడంతో కోతులు దూకుతున్నాయని, పైపులైన్ లీకేజీలు ఉన్నాయంటున్నారు. వాటర్ ట్యాంకు శుభ్రం చేయకపోవడంతో నీళ్లు నల్లగా వస్తున్నాయని దీంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. డాక్టర్ల సూచన మేరకు ఆ నీళ్లు తాగడం లేదని చెబుతున్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ఇంటింటికీ శుద్ధి చేసిన జలాలు అందజేయాలని కోరారు.


కుళాయిలో నల్లగా ఉన్న నీళ్లు

# తాగునీటి సమస్య పరిష్కరించాలి


తాగునీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

### నెల్లికుదురులో ఖాళీ బిందెలతో నిరసన

నెల్లికుదురు, మార్చి 16 : నెల్లికుదురులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కాలనీవాసులతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన చాలా మంది ప్రజలు సమీపంలోని బోరింగ్ నీటిపైనే ఆధారపడ్డారని, అది పాడైపోయి ఏడాది గడుస్తున్నా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు బోరింగ్‌కు మరమ్మతు చేయించడంతోపాటు మండలంలో వివిధ గ్రామా ల్లో పాడైన బోరింగ్‌లను బాగుచేయించి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తోట యాకయ్య్య, శ్రీను, యశోధ, సుభద్ర, నందిని, ఎల్లమ్మ, శోభ, మంగమ్మ, జంపయ్య పాల్గొన్నారు.

## వెలికట్టెలో కాంగ్రెస్ వర్గపోరు


వెంకన్నగౌడ్

తొర్రూరు, మార్చి16 : కాంగ్రెస్ పార్టీ నాయకుడే ఆ పార్టీ కార్యకర్త కిడ్నాప్‌నకు ప్రయత్నించినా నాయకులు పట్టించుకోవడం లేదని తొర్రూరు మండలం వెలికట్టె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అనపురపు వెంకన్నగౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 12న మాలోత్ రా జేందర్ అనే విద్యుత్ ఉద్యోగి తనను రామాఉపేందర్ గార్డెన్ వద్దకు రావాలని కోరడంతో వెళ్లానని, అక్కడికి వెళ్లిన తర్వాత తనను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించాడని తెలిపారు. తాను వెంటనే అప్రమత్తమై తప్పించుకున్నట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరగకపోతే పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగుతానని హెచ్చరించారు. రాజేందర్ కాంగ్రెస్ కార్యకర్తలను బెదిరిస్తున్నాడని ఆరోపించారు. గ్రామంలో ఇప్పటికే కాంగ్రెస్‌లో రెండు వర్గాలు ఏర్పడినట్టు తెలిపారు.

## ఉత్తమ సేవలకు సన్మానం

డోర్నకల్, మార్చి 16: డోర్నకల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గట్టిగుండ్ల మధు ఉత్తమ సేవ లు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి వరంగల్ కన్వెన్షన్‌లో లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా వైస్ గవర్నర్ చంద్రశేఖర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ వక్కంతుల అప్పారావు, విత్తనాల సుధాకర్ పాల్గొన్నారు.


పద్మశాలి చేనేత సంక్షేమ సంఘం నూతన కమిటీ..

## చేనేత సంక్షేమ సంఘం నూతన కమిటీ

తొర్రూరు, మార్చి 16 : తొర్రూరు పట్టణంలోని పద్మశాలి బజార్‌లో ఆదివారం తొర్రూరు పద్మశాలి చేనేత సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రేగొండ వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా మోతె విక్రమ్, ప్రధాన కార్యదర్శి పెండెం వెంకన్న, కోశాధికారిగా మోతె శ్రీనివాస్‌ను సంఘం పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పెండెం రమేశ్, పెండెం పెద్ద ఉప్పలయ్య, జంజిరాల నాగరాజు, అశోక్ , సదాశివుడు, చిన్నఉప్పలయ్య, కొండబత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తెల్లారితే పెళ్లిచూపులు.. అంతలోనే అనంతలోకాలకు..

### విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


శ్రీరాం సోమన్న (ఫైల్)

పెద్దవంగర, మార్చి16 :తెల్లారితే ఆ యువకుడికి పెళ్లి చూపులు.. కానీ, ఆ సంతోషం ఎంతో సేపు నిలువలేదు. విధి వక్రీకరించింది. విద్యుదాఘాతంతో ఆ యువకుడు మృతిచెందాడు. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శ్రీరాం సోమన్న (25) అనే యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఆ యువకుడికి తెల్లవారితే పెళ్లిచూపులు ఉండగా.., తల్లిదండ్రులు ఇల్లు శుభ్రం చేశారు. వృత్తిలో భాగంగా సెలూన్‌షాప్‌లో విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన యువకుడు కాళ్లు, చేతులు కడుక్కొని ఇంట్లోకి వస్తూ, దండంపై ఉన్న టవల్ తీస్తుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు యాకాంబ్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

## కుంగ్ ఫూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


గోల్డ్ మెడల్స్ అందుకుంటున్న చరణ్, కౌశిక్


బయ్యారం, మార్చి 16 : కుంగ్ ఫూ పోటీల్లో ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి తైక్వాండో, కుంగ్ ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఆర్గనైజర్ మొగిలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఇందులో ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జీ చరణ్, ఎం కౌశిక్ కుంగ్‌ఫూ విభాగంలో ప్రతిభ కనబరచి రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను మాస్టర్లు సిద్ధబోయిన సంజీవ, పెనక ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ అంజయ్య, వెంకన్న అభినందించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తొర్రూరు, మార్చి 16 : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పలువులు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాలకు చెందిన 104 మంది లబ్ధిదారులకు రూ. 33,93,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

## వధూవరులకు ఎర్రబెల్లి ఆశీర్వాదం


పెద్దవంగరలో వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎర్రబెల్లి

పెద్దవంగర/తొర్రూరు: పెద్దవంగర మండలంలోని బొమ్మకల్లు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పాడిశెట్టి మురళీగౌడ్, మిత్ర వివాహం ఆదివారం జరగగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే తొర్రూరు మండల కేంద్రానికి చెందిన ఏనుగొండ వెంకన్న కొడుకు వివాహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మరిపెడ : పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ పంపిణీ చేశారు. ఆదివారం పురపాలక సంఘం పరిధిలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ఇద్దరికి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పురపాలక సంఘం కార్యాలయంలో సంఘం అవసరాల నిమిత్తం రెండు ట్రాక్టర్లు, డోజర్, నాలుగు ట్రాలీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, పురపాలక సంఘం కమిషనర్ నరేశ్‌రెడ్డి, శరత్‌చంద్ర గౌడ్, శ్రీనివాస్, వీరన్న, రాధిక, అన్సారీ పాల్గొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయాలి

డోర్నకల్, మార్చి 16 : మండల కేంద్రంలో ఈ నెల 18 నిర్వహించనున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం అమ్మపాలెం, రాజుతండాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రమేశ్, స్వామి, వీరన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే దీక్ష

దంతాలపల్లి, మార్చి 16 : వర్గీకరణ చట్టాన్ని ఆమోదించకుండా ఉన్నత ఉద్యోగాల ఫలితాలను ప్రభుత్వం వెల్లడించి మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లింగయ్య అన్నారు. రిజర్వేషన్ వర్గీకరణ చట్టం వచ్చే వరకు అన్నిరకాల ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం కొనసాగింది. కార్యక్రమంలో వెంకన్న, రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చిన్నగూడూరు, మార్చి16 : మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మెట్టు మహేందర్ భార్య అనిత అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు మాజీ మంత్రి సత్యవతి సహకారంతో రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కాగా, గ్రామంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సునితారామకృష్ణ, రామచంద్రయ్య, శ్రీను, వెంకన్న, మల్లేష్, కృష్ణ, ప్రకాశ్ పాల్గొన్నారు.

## ఇసుక సమస్యను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 16 : ఇసుక సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూసెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే వారికి ఇసుకను ఉచితంగా పంపిణీ చేస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అలాకాకుండా ఇండ్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికీ ఇసుకను ఉచితంగా అందించాలన్నారు. ఇసుక సరఫరా బందు చేయడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని, వెంటనే ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సర్వర్, రాము, బిచ్చా పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు కేంద్రం, రాష్ట్రం ఊడిగం

మహబూబాబాద్ రూరల్, మార్చి 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలను గాలి వదిలి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్తి గార్డెన్‌లో సీపీఎం నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి వర్ధంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు కాకుండా వ్యక్తిగత సమస్యలపైనే చర్చ చేయడం సరికాదన్నారు. అల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరయ్య, రాములు, సాదుల శ్రీనివాస్, సోమయ్య, ఆకుల రాజు, వీరయ్య, రాజన్న పాల్గొన్నారు.

## విద్యారంగానికి పెద్దపీట వేయాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 16 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 19న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల, ప్రవీణ్, శైలజ, సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో కాలిన పైపులు

డోర్నకల్ :రైల్వేస్టేషన్ ఆర్ఆర్ఐ భవనం వెనక ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. రైల్వే హెచ్‌డీపీఈ పైపులు మంటల్లో కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.30వేల నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

## రంజాన్ సరుకుల పంపిణీ

డోర్నకల్, మార్చి 16 : రంజాన్ పండుగ సందర్భంగా డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు మాజీ కౌన్సిలర్ పర్వీన్ సుల్తానా, సలీమ్ దంపతులు ఆదివారం 150 మైనార్టీ కుటుంబాలకు రంజాన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు మతపెద్దలు సుల్తాన్, సలీమ్ సోదరులు గౌస్, జంబూ పాల్గొన్నారు.

## గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

కేసముద్రం, మార్చి 16 : ఆరు గ్యారెంటీలను అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిల భారత రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కన్మంతరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. మహారాష్ట్రలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరగనున్న ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రుణమాఫీ, రైతుబంధు పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాక రైతులు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారని అన్నారు. ఉపాధి పని రోజులతో సంబంధం లేకుండా భూమిలేని ప్రతి మహిళకు రూ.12వేలు అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే నల్లచట్టాలను రద్దు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, కందాల రంగయ్య, ప్రేమ్‌కుమార్, సుందర్, బలరామ్ పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మరిపెడ, మార్చి16 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఆదివారం మరిపెడ ఎస్సై సతీశ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్న డ్రైవర్లు పుల్లూరు నాగరాజు, తేజవత్ సుమన్, కప్పల చంద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దంతాలపల్లి:రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో నరేశ్, ఉమేశ్‌తోపాటు మరో వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో దవాఖానకు తరలించారు.

## అంజయ్యకు సన్మానం

మహబూబాబాద్ రూరల్, మార్చి 16 : నేషనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్రం తరపున జాతీయస్థాయి కాంస్య పతకాన్ని సాధించిన కానిస్టేబుల్ కొంపెల్లి అంజయ్యను, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకమైన శ్రీనివాస్‌ను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెర్రిపోతుల వెంకన్న, వెంకటేశ్వర్లు, కమలాకర్, ముంజాల రాజేందర్‌గౌడ్, వీరేందర్, రాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


కొంపెల్లి అంజయ్య, శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

## మొక్కలు నాటి సంరక్షించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 16 : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని హరిత మిత్ర అవార్డు గ్రహీత, ప్రజా హృదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దైద వెంకన్న అన్నారు. ఆదివారం మండలంలోని జమాండ్లపల్లి గ్రామంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష్ తల్లి దుర్గమ్మ సంవత్సరీకానికి హాజరై మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ పుట్టిన రోజు, శుభకార్యాల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, వెంకన్న, టీచర్లు పాల్గొన్నారు.


అంబరీషకు మొక్కను అందజేస్తున్న దైద వెంకన్న